# గులాబీబాస్ నామినేషన్‌కు సర్వం సిద్ధం

- కోనాయిపల్లిలో కేసీఆర్ పూజలు
- వేంకటేశ్వరుని ఆశీర్వాదం తీసుకున్న సీఎం
- కామారెడ్డిలో నవంబర్ 9న నామినేషన్ దాఖలు
- భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు చేస్తున్న పార్టీ శ్రేణులు



నిజామాబాద్, నవంబర్ 4 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కామారెడ్డి నియోజకవర్గం నుంచి అసెంబ్లీకి పోటీ చేస్తున్న భారత రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్ తన నామినేషన్ దాఖలుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకున్నారు. నవంబర్ 9న కామారెడ్డి రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో స్వయంగా కేసీఆర్ నామినేషన్ సమర్పించనున్నారు. ఉదయం గజ్వేల్‌లో నామినేషన్ వేసిన తర్వాత మధ్యాహ్నం కామారెడ్డిలో దాఖలు చేస్తారు. ఇందులో భాగంగా తనకు అత్యంత సెంటిమెంట్‌గా భావించే సిద్దిపేట జిల్లా నంగునూర్ మండలం కోనాయిపల్లిలోని ప్రసిద్ధ వేంకటేశ్వర స్వామి దేవాలయాన్ని శనివారం సీఎం కేసీఆర్ దర్శించుకున్నారు. ఏదైనా పనిని తలపెట్టేందుకు, ఎన్నికల్లో పోటీకి నామినేషన్ పత్రాలకు ముందు కేసీఆర్ ఇక్కడే ప్రత్యేక పూజలు నిర్వహించడం మూడున్నర దశాబ్దాలుగా ఆనవాయితీగా వస్తున్నది. అదే సంప్రదాయాన్ని కేసీఆర్ ఈసారి కూడా పాటించారు. రాష్ట్ర మంత్రి హరీశ్ రావు, బీఆర్ఎస్ ముఖ్యులతో కలిసి వేంకటేశ్వర స్వామి సన్నిధికి వెళ్లి స్వామి వారి పాదాల చెంత గజ్వేల్, కామారెడ్డి నియోజకవర్గానికి సంబంధించిన నామినేషన్ పత్రాలను కేసీఆర్ సమర్పించారు. దేవాలయ ప్రాంగణంలోనే వేద ఆశీర్వచనాలు పొందడంతో పాటు నామినేషన్ పత్రాలపై సంతకాలు చేశారు.

**1989 నుంచి సెంటిమెంట్**

సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం కోనాయిపల్లి వేంకటేశ్వరాలయం చారిత్రక నేపథ్యం గలది. ఇక్కడి దేవాలయం ముఖ ద్వారం దక్షిణం వైపు ఉంటుంది. ఇలా దక్షిణం వైపు దేవాలయాలు నెలకొనడం చాలా అరుదు. అది కూడా ఈ ఆలయానికి ఒక ప్రత్యేకతగా ఈ ప్రాంతానికి నిలిచింది. కేసీఆర్ ఏ పని తలపెట్టినా, శుభకార్యం చేసినా ఇక్కడ పూజలు చేసిన తర్వాతే పనులను ప్రారంభిస్తారు. ప్రతి ఎన్నికల ముందు నామినేషన్ పత్రాలను వేంకటేశ్వర స్వామి చెంత పెట్టి ప్రత్యేక పూజలు చేయడం దశాబ్దాలుగా కేసీఆర్‌కు సెంటిమెంట్‌గా వస్తున్నది. 1989లో తొలిసారి కోనాయిపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయానికి వచ్చి నామినేషన్ పత్రాలను స్వామి వారి చెంతన పెట్టి పూజలు నిర్వహించారు. అనంతరం వరుసగా ప్రతి ఎన్నికల్లోనూ కేసీఆర్ ఇదే సంప్రదాయాన్ని పాటిస్తూ వస్తున్నారు.

**నవంబర్ 9న బహిరంగ సభ**

కామారెడ్డి నియోజకవర్గం నుంచి పోటీ చేస్తోన్న భారత రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్ ఈ నెల 9న కామారెడ్డికి రానున్నారు. గజ్వేల్‌తో పాటు కామారెడ్డి నుంచి పోటీ చేస్తున్నట్లుగా బీఆర్ఎస్ అధినేత ప్రకటన వెలువరించిన అనంతరం కేసీఆర్ తొలి సారి ఈ ప్రాంతానికి వస్తున్నారు. అక్టోబర్ 30న జుక్కల్, బాన్సువాడలో ప్రజా ఆశీర్వాద సభలకు కామారెడ్డి జిల్లాకు వచ్చినప్పటికీ కామారెడ్డి నియోజకవర్గంలో మాత్రం తొలిసారి అడుగు పెడుతున్నారు. కామారెడ్డిలో నామినేషన్ సమర్పించిన తర్వాత కేసీఆర్ ఇక్కడే ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో పాల్గొంటారు. ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. ప్రజా ఆశీర్వాద సభ ద్వారా కామారెడ్డి నియోజకవర్గ ప్రజలకు సందేశాన్ని కేసీఆర్ ఇవ్వబోతున్నారు. సీఎం కేసీఆరే స్వయంగా ఈ ప్రాంత అభివృద్ధిపై తనకున్న ప్రణాళికను వివరించే అవకాశం ఉంది. గతానికి ఇప్పటికీ కామారెడ్డి ప్రాంతం భారీగా అభివృద్ధి చెందింది. ఎవ్వరూ ఊహించని విధంగా దూసుకుపోతున్న కామారెడ్డికి కేసీఆర్ రాకతో మరిన్ని సౌకర్యాలు, మౌలిక సదుపాయాలు తప్పకుండా నెరవేరనున్నాయి. కామారెడ్డికి కేసీఆర్ వస్తున్నారన్న సమాచారంతో ఇప్పటికే కామారెడ్డి నియోజకవర్గం పరిధిలోని మొత్తం 8 మండలాల ప్రజలంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. స్వచ్ఛందంగా కేసీఆర్‌కు మద్దతు తెలియజేసి కేసీఆర్‌కు అండగా నిలిచి భారీ మెజార్టీ అందించేందుకు అంతా సిద్ధం అవుతున్నారు.

## 15,16 తేదీల్లో కేసీఆర్ ప్రచారం

- ఉమ్మడి జిల్లాలో ఒకే రోజు మూడు...
- 15న బోధన్, నిజామాబాద్ అర్బన్, ఎల్లారెడ్డి
- 16న నిజామాబాద్ రూరల్‌లో ప్రజా ఆశీర్వాద సభ

నిజామాబాద్, నవంబర్4, (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభల మలి విడత షెడ్యూల్ విడుదలైంది. బీఆర్ఎస్ కార్యాలయం విడుదల చేసిన ప్రకటన మేరకు నవంబర్ 15, 16 తేదీల్లో ఉమ్మడి జిల్లాల్లో గులాబీ అధినేత పర్యటన ఖరారైంది. ఇందులో భాగంగా 15వ తేదీనాడు ఒకే రోజు మొత్తం నాలుగు నియోజకవర్గాల్లో జరిగే బహిరంగ సభల్లో కేసీఆర్ పాల్గొంటారు. ఇందులో మూడు సభలు నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లోనే ఉండడం ప్రాధాన్యతను సంతరించుకున్నది. తొలుత బోధన్‌లో, ఆ తర్వాత నిజామాబాద్ అర్బన్‌లో, ఇక్కడ్నుంచి ఎల్లారెడ్డి సభలో కేసీఆర్ పాల్గొంటారు. ఎల్లారెడ్డి సభను ముగించుకుని మెదక్ ప్రజా ఆశీర్వాద సభలో గులాబీ బాస్ హాజరై ప్రసంగిస్తారు.మరునాడు 16వ తేదీ నాడు సైతం నాలుగు బహిరంగ సభల్లో కేసీఆర్ పాల్గొంటుండగా ఇందులో నిజామాబాద్ జిల్లాలో ఒక నియోజకవర్గం ఉంది. నిజామాబద్ రూరల్ నియోజకవర్గంలో ప్రజా ఆశీర్వాద సభకు కేసీఆర్ వస్తారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో నాలుగు ప్రజా ఆశీర్వాద సభలు దిగ్విజయంగా ముగిశాయి. నవంబర్ 9న కామారెడ్డి నియోజకవర్గంలో కేసీఆర్ సభ జరుగనుంది. ప్రజా ఆశీర్వాద సభలను బీఆర్ఎస్ అభ్యర్థులు ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నారు.

## కామారెడ్డిలో సీఎం సభా ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న విప్ గంప గోవర్ధన్, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి

కామారెడ్డి, నవంబర్ 4 : కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కాలేజ్ గ్రౌండ్‌లో ఈ నెల 9వ తేదీన సీఎం పాల్గొననున్న సభా ప్రాంగణాన్ని ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్, ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి, హైదరాబాద్ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ శనివారం పరిశీలించారు. నియోజకవర్గంలోని ప్రతి మండలం, గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి ఈ సభకు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్, నాయకులు నిట్టు వేణుగోపాల్ రావు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జూకంటి ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉమ్మడి జిల్లాలో రెండో రోజు 14 నామినేషన్లు దాఖలు

ఖలీల్‌వాడి, నవంబర్ 4 : నామినేషన్ల స్వీకరణకు రెండో రోజైన శనివారం ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో మొత్తం 14 నామినేషన్లు దాఖలయ్యాయి. నిజామాబాద్ జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో ఏడు నామినేషన్లు వచ్చినట్లు ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు. ఆర్మూర్‌లో ప్రణయ్‌గౌడ్ (ఇండి), బోధన్‌లో సుదర్శన్‌రెడ్డి (కాంగ్రెస్), బాన్సువాడలో పరిగె శ్రీనివాస రెడ్డి (బీఆర్ఎస్), నిజామాబాద్ అర్బన్‌లో దండి లత (బీఎల్ఎఫ్), అనిల్ (ఇండి), నిజామాబాద్ రూరల్‌లో శివరాం (ఇండి), ఆల్ ఇండియా మజ్లిస్ పార్టీ నుంచి సాయన్న నామినేషన్లు వేశారు. కామారెడ్డి జిల్లాలో 7 నామినేషన్లు దాఖలయ్యాయని కలెక్టర్ జితేశ్ పాటిల్ తెలిపారు. కామారెడ్డి నియోజకవర్గంలో 6 నామినేషన్లు దాఖలు కాగా జుక్కల్ నియోజకవర్గంలో ఒక నామినేషన్ దాఖలయ్యాయి. కామారెడ్డి నియోజకవర్గంలో రమేశ్ కుమార్ (ఇండి), చిలక చంద్రశేఖర్ (ఇండి), చిట్టబోయిన నటరాజ (ఇండి), నిఖిల్ రెడ్డి(ఇండి), బెల్లాపురం సతీశ్ కుమార్ (ఇండి), కంటి సాయన్న(ఇండి) ఒక్కో సెట్ చొప్పున నామినేషన్ వేశారని తెలిపారు. జుక్కల్ నియోజకవర్గంలో బీఎస్పీ నుంచి ఏకాంబికర్ ప్రజ్ఞ కుమార్ నామినేషన్ దాఖలు చేశారని తెలిపారు.

## పోలింగ్ విధులను పకడ్బందీగా నిర్వహించాలి

అధికారుల శిక్షణ కార్యక్రమంలో నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు




మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

నిజామాబాద్ స్పోర్ట్స్, నవంబర్ 4 : ఎన్నికల్లో ఎంతో ప్రాధాన్యతతో ఉండే పోలింగ్ విధులను ప్రిసైడింగ్ అధికారులు (పీవోలు), సహాయ ప్రిసైడింగ్ అధికారులు (ఏపీవోలు) సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సూచించారు. పోలింగ్ రోజున కలెక్టర్‌తో పోలిస్తే పీవోలు నిర్వర్తించాల్సిన బాధ్యత ఎంతో ప్రాముఖ్యతతో కూడుకున్నది కావున క్రియాశీలకంగా వ్యవహరించాలన్నారు. పోలింగ్ ప్రక్రియకు సంబంధించిన ప్రతి అంశంపై పూర్తి అవగాహన ఏర్పర్చుకోవాలన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో ప్రిసైడింగ్ అధికారులకు శనివారం మలివిడుత శిక్షణ కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. నిబంధనలు పక్కాగా పాటిస్తూ పోలింగ్ ప్రక్రియను సాఫీగా నిర్వహించాలని, ఏ చిన్న తప్పిదానికి ఆస్కారం కల్పించకూడదని సూచించారు. పోలింగ్ సందర్భంగా ఓటింగ్ యంత్రాలలో ఏదైనా సాంకేతిక సమస్య తలెత్తితే నిబంధనలకనుగుణంగా వ్యవహరించాలని, మాక్ పోల్ సమయంలో సాంకేతిక ఇబ్బంది ఏర్పడినప్పుడు సంబంధిత బీయూ, సీయూ లేదా వీవీ ప్యాట్ యంత్రాన్ని మాత్రమే మార్చాలని, పోలింగ్ సమయంలో మాత్రం కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్‌లో ఏఒక్క దానిలోనా సమస్య తలెత్తినా సీయూ, బీయూ రెండింటిని మార్చాలని సూచించారు. పోలింగ్ విధులు కేటాయించబడిన అధికారులు, సిబ్బంది ఈ నెల 29న ఉదయం 7 గంటల వరకు తమతమ డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు చేరుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. చెక్‌లిస్టుకు అనుగుణంగా పోలింగ్ సామగ్రి ఉందా, లేదా అన్నది జాగ్రత్తగా పరిశీలించుకోవాలని సూచించారు. శిక్షణ తరగతుల్లో అదనపు కలెక్టర్ పి.యాదిరెడ్డి, మాస్టర్ ట్రైనర్లు, ప్రిసైడింగ్ అధికారులు పాల్గొన్నారు.

## ప్రపంచ చెస్‌బాక్సింగ్‌లో సత్తా చాటిన పిట్లం విద్యార్థిని

పిట్లం, నవంబర్ 4: ప్రపంచ చెస్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో పిట్లం గ్రామానికి చెందిన తక్కడపల్లి ప్రతిభ సత్తా చాటింది. ఈ పోటీల్లో బంగారు పతకం సాధించింది. దీంతో పిట్లం మండల ప్రజలు ఆమెను అభినందించారు. ఈ సందర్భంగా తండ్రి నర్సింగ్‌రావు మాట్లాడుతూ.. ఇటలీలో ఈనెల 2వ తేదీన నిర్వహించిన చెస్ బాక్సింగ్ పోటీల అండర్-45 కేజీల విభాగంలో ప్రతిభ చూపి బంగారు పతకం సాధించిందని అన్నారు. గతంలో నిర్వహించిన పలు పోటీల్లో ఆమె ఆరు బంగారు, రెండు రజత పతకాలు సాధించిందని తెలిపారు.




నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

**CHANGE OF NAME**

I, SAYED MEHOOD SAYED SAFALI R/o. H.No.12-1-6/1, Arsapally, Nizamabad T.S. Change my New Name as SYED MAHMOOD S/o SYED SAIF ALI
NTZ-318608

**WANTED**

రామకృష్ణ గ్రూప్ (TS & AP No. 1) Hyd., VJA. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు వర్కర్లు (M/F) కావలెను. భో+వ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు కమీషన్: 5,000/-. Ph: 9281452833, 6281208600.
NT-320535

**PLOT FOR SALE**

హైదరాబాద్, హయత్‌నగర్, పెద్ద అంబర్‌పేట్, కొహెడ, జనచైతన్య, బాటసింగారం శ్రీమిత్రలో ప్లాట్లు కొనబడును/ అమ్మబడును, నో Brokers. Ph: 9666912111, 7995005999.
NT-318030

**WANTED**

"హైదరాబాద్" నందు వృద్ధులను "వారి ఇంట్లోనే ఉండి" చూసుకోవడానికి వర్కర్స్ కావలెను. ఉచిత వసతి, భోజనం. జీ: 15-25 వేలు, ఏజంట్ కమీషన్: 3-5 వేలు, M/F, 20-50 సం||లు. *హేమ హోమ్ హెల్త్‌కేర్*-7330746999.
NT-320244

**పాస్‌పోర్ట్ పోయినది**

నేను సుంచ అశోక్ తండ్రి పెద్ద బాలయ్య, ఇ.నెం. 1-103, గ్రా|| సీతాయిపేట్, మం|| ధర్పల్లి, జి|| నిజామాబాద్.తెలంగాణ 503 165 నేను తేది: 11-10-2023 నాడు సీతాయిపేట్ గ్రామం నుండి ధర్పల్లికి బైక్ పైన పోయినప్పుడు నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్ట్ నెం. P5064024 గలది మార్గమధ్యలో ఎక్కడో పడిపోయినది కావున దొరికినవారు ఈ నెంబర్‌కి తెలియజేయగలరు. సెల్: 9652226006

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన
4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును
సెల్: 91827 77590